క్లుప్తంగా

నేడు ఖాదర్‌పల్లెలో వైద్య శిబిరం

చాపాడు: మండల పరిధిలోని ఖాదర్‌పల్లె గ్రామంలో శుక్రవారం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి డాక్టర్ రాజేష్‌కుమార్ తెలిపారు. గ్రామంలోని విలేజ్ క్లీనిక్ వద్ద ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సచివాలయ పరిధిలోని ప్రజలకు ప్రత్యేక వైద్య నిపుణులతో అన్ని రకాల వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం



కవాతు నిర్వహిస్తున్న సాయుధ బలగాలు

కాశినాయన: ప్రశాంత వాతావరణంలో స్వార్వత్రిక ఎన్నికలను నిర్వహించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని ఎస్ఐ అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం జిల్లా ఎస్పీ సిద్దార్థ్‌కౌశల్ ఆదేశాల మేరకు కేంద్ర సాయుధ బలగాలతో ఎస్ఐ ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. సమస్యాత్మక గ్రామాలైన ఇటుగుల్లపాడు, సావిశెట్టిపల్లె, నాయునిపల్లె, వరికుంట్ల, బాలాయపల్లె, గొంటువారిపల్లె, చెన్నవరం, రెడ్డికొట్టాల, కొండ్రాజుపల్లె, మిద్దెల, నరసాపురంలలో కేంద్ర సాయుధ బలగాలతో కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రజలు నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకునేందుకు భరోసా కల్పించడం కోసం కవాతు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రేపు అల్లాడుపల్లెలో వేలం పాట

చాపాడు: మండలంలోని అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి దేవస్థాన సన్నిధిలోని టీటీడీ కల్యాణ మండపంలో సప్లయర్స్ సామాగ్రి నిర్వహణకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాసులు తెలిపారు. ఉదయం 10 గంటలకు ఆలయ చైర్మన్ జీవై వెంకటసుబ్బారెడ్డి (ఉదయ్) ఆధ్వర్యంలో వంట సామానులు, షామియానాలు, కుర్చీలు, టెబుల్స్, డెకరేషన్, డిస్కో డెకరేషన్ ఇతర సామాగ్రి వేలం పాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అత్యధిక వేలం పాట దారుడికి హక్కు కల్పించటం జరుగుతుందని ఈఓ తెలియజేశారు.

వారసత్వ సంపద భద్రం

కడప కల్చరల్ : వారసత్వ సంపదను భద్రంగా కాపాడటం వెనుక చర్చి నిర్వాహకుల కృషి ఎంతైనా ఉందని భారత జాతీయ కళా సంస్కృతి వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) జిల్లా కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి తెలిపారు. ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా నగరంలోని కాంగ్రిగేషనల్ టౌన్ చర్చి, మజ్జిద్-యే-ఆజం, బ్రాహ్మణవీధిలోని ఆంజనేయస్వామి ఆలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. కాంగ్రిగేషనల్ టౌన్ చర్చిఆధునికంగా కనిపించేలా తీర్చిదిద్దామని తెలిపారు. ఇంటాక్ ప్రతినిధులు కొండూరు జనార్దన్‌రాజు, గౌరీశంకర్, రాఘవేంద్రవర్మ, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజంపేట శాసనసభ నియోజకవర్గ అభ్యర్థి ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ నాయకులు పి.జయచంద్రారెడ్డి, కోలా కొండయ్య, రమేష్ రెడ్డి కోరారు. గురువారం నామినేషన్ వేస్తున్న ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డిని వారు ఘనంగా సన్మానించారు. ఆకేపాటి గెలుపు తథ్యమని వారు తెలిపారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి



చిన్నారులకు జాగ్రత్తలను తెలియజేస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్నలత

కడప కోటిరెడ్డిసర్కిల్ : రోజు రోజుకూ ఎండలు తీవ్రమవుతున్న తరుణంలో వడదెబ్బ తగలకుండా చిన్నారులు జాగ్రత్తలు పాటించాలని అర్బన్ హెల్త్ ట్రెనింగ్ సెంటర్ హెల్త్ ఎడ్యుకేటర్ ఆర్.ప్రసన్నలత తెలిపారు. నగరంలోని సీఎస్ఐ హైస్కూల్‌ను ఆమె సందర్శించి విద్యార్థులకు సూచనలు చేశారు. ఆమె మాట్లాడుతూ వేడిమి అధికంగాఉన్న కారణంగా రోజుకు కనీసం ఆరు లీటర్ల నీటిని తీసుకోవాలని, మజ్జిగ, పండ్ల రసాలు, గ్లూకోజ్ నీటిని తాగాలని సూచించారు.

వైఎస్సార్సీపీలోకి చేరిక

సింహాద్రిపురం : మండలంలోని హిమకుంట్ల గ్రామానికి చెందిన వెంకటసుబ్బారెడ్డి, శివానందరెడ్డి, పోరెడ్డి శంకర్‌రెడ్డి, పోరెడ్డి రాజేశ్వర్‌రెడ్డిలు గురువారం వైఎస్సార్సీపీ ఎన్నికల పరిశీలకులు గండ్లూరి వీరశివారెడ్డి, వైఎస్సార్సీపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నెట్‌క్యాబ్ డైరెక్టర్ కిషోర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి కుమారుడు తుషార్ నాగిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు బ్రహ్మానందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

‘వరద’ బలవంతపు వసూళ్లు ఆపాలి

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



బొల్లవరం బాషాతో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు: టీడీపీ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి బలవంతంగా పార్టీలో చేర్చుకుంటున్నారని, చందాల పేరుతో బలవంతపు వసూళ్లకు పాల్పడడం ఆపాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి హితవుపలికారు. అంజుమన్ కమిటీ మాజీ ప్రెసిడెంట్ బొల్లవరం బాషాతో కలసి గురువారం పాత బస్టాండ్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బొల్లవరం బాషాకు దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అంటే ప్రత్యేక అభిమానం అని, ఆయన వైఎస్సార్‌సీపీలో ఉన్నారని తెలిపారు. ముస్లిం మైనారిటీల్లో పెద్దమనిషిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. బుధవారం శ్రీనివాసనగర్‌లో ఎన్నికల ప్రచారానికి వెళ్లినప్పుడు బాషాకు ఇష్టం లేకుండా వరదరాజులరెడ్డి బలవంతంగా టీడీపీలో చేర్చుకున్నారని విమర్శించారు. ఎదుటి వ్యక్తులను వరదరాజులరెడ్డి బాధపెట్టడం తగదన్నారు. తన సోదరుడు కిరణ్‌కుమార్‌రెడ్డితో బొల్లవరం బాషాకు వ్యాపార సంబంధాలు ఉన్నాయని, ఆయన కుటుంబం అంటే తమకు ప్రత్యేక అభిమానం ఉందని తెలిపారు. అయితే వరదరాజులరెడ్డి మాత్రం ఇలాంటి వారిని బలవంతంగా తమ పార్టీ కండువా కప్పి పార్టీలో చేర్చుకోవడం, చందాల పేరుతో బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

అభిమానంతో ఓటేయండి

ఎవరైనా చందాలు ఇష్టపూర్వకంగా ఇవ్వాలని, అలా కాకుండా వరదరాజులరెడ్డి దాదాగిరి, గుండాగిరి తలపించేలా రూ.5 లక్షలు, రూ.10 లక్షలు ఇవ్వాలని టార్గెట్ విధిస్తున్నారని వెల్లడించారు. ఎన్నికల్లో ఓట్లు కొనడానికి నోట్లు కావాలని వరద చెబుతున్నారన్నారు. తనకు ఎవరూ రూపాయి కూడా చందా ఇవ్వాల్సిన అవసరం లేదని, ప్రేమాభిమానాలతో ఓటు వేస్తే చాలని రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. తాను ఏనాడు చందాలు అడగలేదని, ఎవరినీ బాధ పెట్టలేదని తెలిపారు. అనంతరం బొల్లవరం బాషా మాట్లాడుతూ శ్రీనివాసనగర్‌లో వరదరాజులరెడ్డి ప్రచారానికి వచ్చిన సందర్భంగా మా ఇంటికి వచ్చి ఓటు అడిగారన్నారు. తొలి నుంచి తాను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభిమానని తెలిపారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, షా హుసేన్‌వలి దర్గాకు రూ.కోటి విరాళం ప్రకటించి నిర్మాణానికి సహకరించారని కొనియాడారు. తాను ఇష్టపూర్వకంగా టీడీపీ కండువా వేసుకోలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కమాల్ బాషా, ఖలీలుల్లా, ముస్లిం మైనారిటీ నాయకులు వడ్ల దాదాపీర్, నూరి, హిదాయత్, చాంద్ బాషా, పాలగిరి ఖాజా, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, మాజీ కౌన్సిలర్ శౌరి సుభాష్‌రెడ్డి, సుభాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మా హయాంలోనే గోపవరం అభివృద్ధి

తమ హయాంలోనే గోపవరం గ్రామ పంచాయతీ అభివృద్ధి చెందిందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. గోపవరం పంచాయతీ పరిధిలోని శ్రీనివాసపురంలో ఎమ్మెల్యే రాచమల్లు, ఆయన సతీమణి రాచమల్లు రమాదేవి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి రాచమల్లు శివప్రసాదరెడ్డిని, ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా రాచమల్లు శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ గోపవరం పంచాయతీలోని హౌసింగ్ బోర్డు, యానాది కాలనీ, ఇందిరానగర్, శ్రీనివాసపురంతో పాటు అన్ని ప్రాంతాల్లో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించామన్నారు. హౌసింగ్ బోర్డులో రూ.4కోట్లతో పార్కు నిర్మిస్తున్నామని, పెన్నానది నుంచి తాగునీరు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ జేష్టాది శారద, మాజీ జెడ్పీటీసీ గోర్ల రామలక్ష్మి, దొరసానిపల్లె సర్పంచ్ అరవ ఈశ్వరమ్మ, గోపవరం సర్పంచ్ గద్దా మోషా, మాజీ ఉపసర్పంచ్ రాఘవేంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ దేవీ ప్రసాదరెడ్డి, వైస్ ఎంపీపీ ఆసం దస్తగిరిరెడ్డి, నగర కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పర మురళి, అటవీ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ సానపురెడ్డి ప్రతాప్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కొండయ్య, గుమ్మళ్ల పద్మావతి, గజ్జల కళావతి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సోదరుడు రాచమల్లు కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ గురువారం కొత్తపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని అమృతానగర్‌లో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి రాచమల్లు శివప్రసాదరెడ్డి, ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డిలను గెలిపించాలని కోరారు. ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఏ శక్తి ఆపలేదు

ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, చిత్రంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

మైదుకూరు: వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఏ శక్తి ఆపలేదని, జూన్ 10న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం తథ్యమని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీకి ఎవరితో పొత్తులు పెట్టుకోవాల్సిన అవసరం లేదని, తమ పొత్తు ప్రజలతోనే అని ఆయన అన్నారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన తొలి రోజే గురువారం ఎమ్మెల్యే రఘురామిరెడ్డి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు ఏమి చేయలేదని ఆరోపించారు. అందుకే అన్ని పార్టీలతో పొత్తు పెట్టుకుంటున్నారని విమర్శించారు. ప్రధాని మోదీపై గతంలో అనేక విమర్శలు గుప్పించిన చంద్రబాబు మళ్లీ వారి కాళ్ల వద్దకే వెళ్లారని ఎద్దేవా చేశారు. 2029 ఎన్నికల నాటికి టీడీపీ, జనసేన, బీజేపీలో విలీనం అవుతాయని జోస్యం చెప్పారు.

ప్రజలందరికీ మేలు జరిగింది

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి మేలు జరిగిందని, ప్రతి ప్రాంతం అభివృద్ధి చెందిందని ఎమ్మెల్యే తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాడు–నేడు పేరుతో గత ప్రభుత్వంలో పాఠశాలలను అభివృద్ధి చేశామన్నారు. ఆర్బీకేల ద్వారా ఎరువులు, పురుగు మందులు అందించామని, సచివాలయాల్లో వ్యవసాయ సహాయకులను ఏర్పాటు చేసి రైతులకు పంటల సాగులో సలహాలు, సూచనలు ఇప్పించామన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మైదుకూరు నియోజకవర్గంలో రూ.124 కోట్లు పంటల బీమా కింద రైతులకు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, ఎమ్మెల్యే తనయులు నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, శెట్టిపల్లె అశోక్ (బాబ్జి), ఉద్యానశాఖ ప్రభుత్వ సలహాదారుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ మదీనా దస్తగిరి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్మయి, నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను బాధపెట్టవద్దు

వైవీయూ : అర్ధాంతరంగా తనువు చాలించి.. తల్లిదండ్రులను బాధపెట్టవద్దని యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ విద్యార్థులకు ఉద్బోధించారు. విశ్వవిద్యాలయ పరిపాలన భవన ప్రాంగణంలో ఇటీవల మృతి చెందిన వైవీయూ విద్యార్థిని ఎస్.షమ్మా సుల్తానా సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీతో పాటు రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథ రెడ్డి, విద్యార్థులు, షమ్మా సుల్తానా చిత్రపటంవద్ద పుష్పాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. వీసీ మాట్లాడుతూ బిడ్డల బంగారు భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు తపిస్తారని, అలాంటి వారిని జీవితాంతం శోకానికి గురి చేయడం పెద్దతప్పిదమన్నారు. సమస్య ఉన్నా అధ్యాపకులు, అధికారులకు తెలియజేస్తే పరిష్కారం సూచిస్తారన్నారు.

ఘనంగా సీతారాముల పట్టాభిషేకం



రాజుపాళెంలో గరుత్మంతుడి వాహనంపై ఊరేగుతున్న సీతారామలక్ష్మణులు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో గురువారం శ్రీరామనవమి వేడుకల ముగింపు సందర్భంగా సీతారాముల పట్టాభిషేక మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవ, విశేష అభిషేకాలు, అర్చనలు, తిరుమంజనం, సామ్రాజ్యపట్టాభిషేక మహోత్సవాలను వేదపండితులు నిర్వహించారు. గణపతి, నవగ్రహ, శాంతి హోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల గ్రామోత్సవం

రాజుపాళెం: శ్రీరామనవమిని పురస్కరించుకుని మండల కేంద్రమైన రాజుపాళెంలోని కోదండరామ స్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని సీతారామలక్ష్మణ, ఆంజనేయస్వామికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సీతారామలక్ష్మణులను ప్రత్యేకంగా అలంకరించి గరుత్మంతుడి వాహనంపై ఊరేగించారు. స్వాములను రాత్రి 10 గంటల నుంచి శుక్రవారం తెల్లవారుజామున 6 గంటల వరకు గ్రామంలో ఊరేగించారు. స్వాములు తమ ఇంటి వద్దకు రాగానే ప్రజలు కాయాకర్పూరం సమర్పించి పూజలు చేశారు. ఆలయ ఆవరణలో బొమ్మలు, ఆట వస్తువులు ఏర్పాటు చేయడంతో పండుగ వాతావరణం సంతరించుకుంది.

సంక్షేమ ప్రభుత్వానికి పట్టం కట్టండి



ఇంటింటి ప్రచారంలో గోవిందరెడ్డి, నాయకులు



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్: అన్నివర్గాల ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అందజేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మరోసారి పట్టం కట్టాలని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డులోని ఎన్‌జీఓకాలనీలో నార్త్ అమెరికా ప్రభుత్వ ప్రతినిధి పండుగాయల రత్నాకర్‌తో కలిసి ప్రజాదీవెన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం చేసిన మేలును ప్రజలకు వివరిస్తూ ఎంపీ అభ్యర్థి వైఎస్అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి అయిన తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ఏనాడు పేదల సంక్షేమాన్ని పట్టించుకోలేదని, ప్రజలకు మేలు చేసి ఉంటే పొత్తులు పెట్టుకోవాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను కూడా అమలు చేసి ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్నారని కొనియాడారు. మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, ఆయా కార్పొరేషన్ల డైరెక్టర్లు అల్లాబకాష్, కేశవరెడ్డి, గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు బంగారు శీనయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలిరెడ్డి, జిల్లా కార్యదర్శి యద్దారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ సుబ్బారెడ్డి, కౌన్సిలర్లు శంకర్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, దుద్దుకూరు సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, ఆవులశ్రీను, చెన్నకృష్ణారెడ్డి, మౌలాలి, బాబ్జీ, పల్లెసుబ్బారెడ్డి, రమణారెడ్డి, శేఖర్‌రెడ్డి, సాంబశివారెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి ఎస్.వెంకటేశ్వర్లు, యువజన విభాగం నాయకులు సుధాకర్‌రెడ్డి, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

పోరుమామిళ్ల: గ్రామాలలో సుపరిపాలన అందించేందుకు సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి కొనియాడారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి ఆయన పాలన కొనసాగించారని ప్రశంసించారు. గురువారం కవలకుంట్ల పంచాయతీలో గోవిందరెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆదరించాలని, ఎంపీ అభ్యర్థి అవినాష్‌రెడ్డిని, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సుధను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఆప్కాస్ స్టేట్ డైరెక్టర్ డాక్టర్ కల్యాణ చక్రవర్తి, జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీలు సీఎం బాషా, రాజశేఖర్, అడ్వకేట్ ప్రభాకర్, సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాబు, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గురయ్య, ఎంపీటీసీలు వెంకటేశ్వర్లు, సీతారాంరెడ్డి, నాయకులు రవిచంద్రారెడ్డి, చిలుకూరి నారాయణ, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకే ఓటేయండి

గోపవరం: ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని వైఎస్సార్‌సీపీ యువ నాయకులు దేవసాని ఆదిత్యరెడ్డి, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఎస్.రామాపురం, మీరబ్బుల్లాయపల్లె, రేకలకుంట, ఎస్.రామాపురం దళితవాడలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న పాలనలో పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలకు లబ్ధి చేకూరిందన్నారు. తిరిగి సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సుధ, ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, మల్లెంకొండ చైర్మన్ గోవిందరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పుల్లయ్య, సర్పంచ్ రాధాకృష్ణారెడ్డి, మార్కెట్‌యార్డు డైరెక్టర్ వెంకటసుబ్బారెడ్డి, పార్టీ నాయకులు కె.వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి, హరికృష్ణారెడ్డి, కొండారెడ్డి, కె.రమణారెడ్డి పాల్గొన్నారు.

జోరుగా ఇంటింటి ప్రచారం

అట్లూరు: మండల పరిధిలోని మణ్యంవారిపల్లె గ్రామంలో గురువారం మండల సచివాలయాల కన్వీనర్ మన్నెంమల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సుధ, ఎంపీ అభ్యర్థి వైఎస్అవినాష్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న ప్రభుత్వంలో జరిగిన మేలును గుర్తు చేస్తూ ప్రచారం నిర్వహించారు. మండల కన్వీనర్ ముడమాల ప్రభాకర్‌రెడ్డి, జిల్లా పశుగణాభివృద్ధి సంఘం చైర్మన్ రొండా మాధవరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి అందూరి రామకృష్ణారెడ్డి, మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ముడమాల బాలమునిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సిద్దవటం పెంచల్‌రెడ్డి, పొన్నవోలు బ్రహ్మానందరెడ్డి, మల్లారెడ్డి, బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

42 మంది వలంటీర్లు రాజీనామా



రాజీనామా చేసిన వలంటీర్లు

ప్రొద్దుటూరు: కొత్తపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని 4, 5 గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న 42 మంది వలంటీర్లు గురువారం స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని కల్పించిన జగనన్న కోసం ఎన్నికల్లో పనిచేస్తామని వారు ఈ సందర్భంగా తెలిపారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు రాచమల్లు శివప్రసాదరెడ్డి, వైఎస్ అవినాష్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలుపొందేందుకు కృషి చేస్తామన్నారు.

గోపవరం: మండలంలోని టీ.సండ్రపల్లె సచివాలయం పరిధిలోని ఎస్.రామాపురం, రేకలకుంట గ్రామాల్లో పనిచేస్తున్న 8 మంది వలంటీర్లు గురువారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి వెంకటసుబ్బయ్యకు అందజేశారు. ఆయన ఎంపీడీఓ రాధాకృష్ణన్‌కు అందజేశారు. నిస్వార్థంగా ప్రజలకు సేవలందిస్తున్న తమను ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్ తమపై ఆరోపణలు చేయడంతో పాటు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించి విధుల నుంచి తప్పించారని తెలిపారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

నేడు ఎన్నికల ప్రచారం

వల్లూరు : మండలంలోని తప్పెట్ల గ్రామ పంచాయతీ పరిధిలోని తప్పెట్ల, పుల్లారెడ్డిపేట, చెరువుకిందిపల్లె గ్రామాల్లో శుక్రవారం మధ్యాహ్నం వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం జరుగుతుందని ఆ పార్టీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రతి విద్యార్థి ఒక శాస్త్రవేత్త

కడప అగ్రికల్చర్: ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు చదివి శాస్త్రవేత్తగా రాణించాలని వ్యవసాయ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ శ్రీనివాసాచారి సూచించారు. కడప నగర శివారులోని ఊటకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉన్నత చదువులు అభ్యసించి రైతులతోపాటు వ్యవసాయ రంగ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో డాక్టర్ వీరయ్య, అంకయ్యకుమార్, సునీల్ కుమార్, శ్రీవల్లి, భాగవతి ప్రియ, కృష్ణప్రియ, శిల్పకళ, మహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

నిప్పును నిర్లక్ష్యం చేస్తే పెను ముప్పు



బద్వేలు అర్బన్: ఆస్పత్రి సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



ప్రొద్దుటూరు క్రైం: ఫ్యాక్టరీలో మంటలను ఎలా ఆర్పాలో చూపిస్తున్న అధికారి రఘునాథ

ప్రొద్దుటూరు క్రైం: నిప్పును నిర్లక్ష్యం చేస్తే పెను ముప్పు సంభవిస్తుందని సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి ఎ.రఘునాథ హెచ్చరించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఐదో రోజు గురువారం పొట్టిపాడు రోడ్డులోని పేపర్ ప్లేట్ ఫ్యాక్టరీలో పరిశ్రమలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎ.రఘునాథ మాట్లాడుతూ పరిశ్రమల దగ్గర పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అగ్ని ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి అగ్గిరవ్వలు మిషనరీ బెల్టులు, పుల్లీస్, విద్యుత్ పరికరాల నుంచి రాకుండా జగ్రత్త వహించాలని సూచించారు. ఎలక్ట్రికల్ ఫైర్ జరిగినప్పుడు ప్రథమంగా మెయిన్ స్విచ్ ఆఫ్ చేసిన తర్వాత సంబంధిత ఫైర్‌ను ఆర్పడానికి ప్రయత్నించాలన్నారు. విద్యుత్ ప్రవహిస్తున్న వైర్లు, తీగలపై అత్యవసర పరిస్థితుల్లో కార్బన్ డైఆక్సైడ్ అగ్నిమాపక పరికరాన్ని వాడాలని తెలిపారు. పోర్టబుల్ అగ్నిమాపక పరికరాలు వాడే విధానాన్ని రఘునాథ వివరించారు. అలాగే కొర్రపాడు రోడ్డులోని టీవీఆర్ పెట్రోలు బంకులో సిబ్బందికి పోర్టబుల్ అగ్నిమాపక పరికరాలు వాడే విధానం తెలిపారు. డీజిల్ లేదా పెట్రోలు వాహనాలలో నింపునపుడు వాహనం ఇంజిన్‌ను ఆఫ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఫైర్‌మెన్ నారాయణరెడ్డి, డ్రైవర్ ఆపరేటర్ శ్రీనివాసరెడ్డి, ఫైర్‌మెన్లు రాజశేఖర్‌రెడ్డి, నరేంద్రకుమార్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద నిరోధక యంత్రాలపై అవగాహన అవసరం

బద్వేలు అర్బన్: అగ్ని ప్రమాదాల సమయంలో మంటలను అదుపు చేసేందుకు ఉపయోగించే సీఓటు, డీసీపీ యంత్రాల పనితీరుపై అవగాహన పెంచుకుంటే ప్రమాద సమయంలో వాటిని ఉపయోగించుకుని ప్రమాద తీవ్రతను దూరం చేయవచ్చని ఇన్‌చార్జి ఫైర్‌ఆఫీసర్ కె.వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా గురువారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో అగ్ని ప్రమాదాల నివారణపై వైద్యసిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రులలో అగ్ని ప్రమాదాల నివారణ కోసం సీఓటు, డీసీపీ యంత్రాలు ఏర్పాటు చేసినప్పటికీ వాటిని ఎలా ఉపయోగించాలో తెలియక ప్రమాదాలు జరిగినపుడు నష్టం వాటిల్లుతుంటుందని అన్నారు. ఆస్పత్రి సిబ్బంది అగ్ని ప్రమాద నివారణ యంత్రాలను ఎలా ఉపయోగించాలో ప్రయోగాత్మకంగా తెలుసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మంటలు సంభవించినపుడు ఎలా అదుపు చేయాలో ఆస్పత్రి సిబ్బందితోనే ప్రయోగాత్మకంగా చేయించారు. అలాగే ఆస్పత్రి బహుళ అంతస్థు భవనాలలో ఉన్న రోగులను ఎలా కాపాడాలో చేసి చూపించారు. కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ రాంప్రసాద్, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, ఫైర్‌మెన్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో అగ్ని ప్రమాదాలపై అవగాహన

పోరుమామిళ్ల: పట్టణంలోని ఓఎల్ఎఫ్ ఆస్పత్రిలో గురువారం స్థానిక అగ్నిమాపక సిబ్బంది అగ్నిప్రమాదాలపై సిబ్బందికి, రోగులకు అవగాహన కల్పించారు. ఆస్పత్రిలో అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు రోగులను ఎలా కాపాడాలో వివరించారు. పై అంతస్తులో చిక్కుకున్న వారిని రెస్క్యూ మెథడ్ ద్వారా కిందికి ఎలా తీసుకురావాలో ప్రదర్శన ద్వారా చూపించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు లిఫ్ట్ ఉపయోగించరాదని, మెట్ల మార్గాన్నే ఎంచుకోవాలన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి నజీర్ అహమ్మద్, ఆసుపత్రి వైద్యులకు, సిబ్బందికి ప్రమాద సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.